హైదరాబాద్
7-10-2023
సంపుటి:08
సంచిక: 362
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారు!

**అందుకే 28 రోజులుగా రిమాండులో బాబు**

**టీడీపీ అధినేతపై ఎందుకీ నిర్బంధం?**

**ఆంధ్రాను అభివృద్ధి చేసినందుకా?**

**పోలవరం 72% పూర్తి చేసినందుకా?**

**వైసీపీ అవినీతిని ప్రశ్నించినందుకా?**

**బాబుతో ములాఖత్ అనంతరం**

**మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ ఆవేదన**

**నేడు మళ్లీ ఢిల్లీకి యువనేత**

రాజమహేంద్రవరం, "మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై దొంగ కేసులు పెట్టి వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. అందువల్లే 28రోజులుగా ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండాల్సి వస్తోంది" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి





## 60 రోజుల్లోనే ఎన్నికలు

**ప్రతీ ఇంటికి వెళ్లండి..ప్రతీ ఒక్కరిని కలవండి..ప్రతీ గుండెను తట్టండి**

**రాష్ట్ర కౌన్సిల్ విస్తృత సమావేశంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభ ఉపన్యాసం**

హైదరాబాద్: అరవై రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.. పార్టీగా పోరాడేందుకు మనకు 50 రోజులే సమయం ఉందని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ సమీపంలోని ఓ కాలేజీలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ విస్తృత సమావేశంలో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లండి.. ప్రతీ ఒక్కరిని కలవండి.. ప్రతీ గుండెను తట్టండి అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'కష్టపడి పనిచేద్దాం.18 నుంచి 30 ఏళ్లలోపు వారిని ఆకర్షిద్దాం.. కేసీఆర్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. మోదీ పాలనపై విశ్వాసం కలిగిద్దాం. ఆయన నాయకత్వంలో గోల్కొండ కోటపై.. తెలంగాణ అసెంబ్లీపై

2లో

## హైదరాబాద్ కేపీహెచ్‌బీలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్: నగరంలోని కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి పై ఉన్న ఫర్నిచర్ దుకాణంలో ఈ ప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది నాటుగు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భారీగా ఎగసిపడుతున్న మంటలు సమీపంలో ఉన్న మరో మూడు దుకాణాలకూ వ్యాపించాయి. శ్రీ ఫుట్ వరల్డ్, ఎంఎస్ ఫర్నిచర్, ఫుట్ నీడ్స్, వాచెస్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాప్‌లు తగలబడిపోయాయి.





## ఎవరేం చేశారో తేల్చుకుందామా?

**బహిరంగ చర్చకు సిద్ధమా!?.. తేదీ చెబితే వస్తాం**

**కేటీఆర్, హరీశ్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సవాల్**

**కాంగ్రెస్ లేకపోతే మీ కుటుంబం బిచ్చమెత్తేది**

**సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లో మీరు అమలు చేస్తున్న పథకాలను ఇతరచోట్ల ఇస్తున్నారా!?**

**బిల్లారంగాలు ఊళ్లపై పడి కుక్కల్లా కరుస్తున్నారు**

**బీఆర్ఎస్ 25 సీట్లకే పరిమితం: రేవంత్ రెడ్డి**

**ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీ కసిరెడ్డి**

2లో

## రెండేళ్లలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించేస్తాం

**నిర్ణయాత్మక దశకు నక్సల్ వ్యతిరేక పోరు**

**ముఖ్యమంత్రులతో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా**

న్యూఢిల్లీ, రెండేళ్లలో దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదాన్ని సంపూర్ణంగా నిర్మూలిస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటం నిర్ణయాత్మక దశకు చేరుకుందని





# కృష్ణా జలాలపై హక్కులను పరిరక్షించండి

**ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ**

**రాష్ట్ర ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోండి**

**కేడబ్ల్యూడీటీ%--%2కు మరిన్ని విధి విధానాలొద్దు**

**కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆశ్చర్యపరుస్తోంది**

**2 రాష్ట్రాలకే దీనిని వర్తింప చేయాలని సూచించడం అశాస్త్రీయం**

**తదుపరి చర్యలు తీసుకోకుండా నిలిపేయాలని వినతి**

అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించకుండా పరిరక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతుర్రాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూడ ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ షేరింగ్ డిస్‌ప్యూట్స్) శ

2లో

# మళ్లీ వచ్చేది ఇచ్చేదీ కేసీఆరే

## గ్రేటర్ వరంగల్ పర్యటనలో కేటీఆర్



- **రాజకీయ పర్యాటకుల్ని అస్సలు నమ్మొద్దు**
- **ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు ప్రతిపక్షాలు వస్తాయి**
- **బీజేపీ, కాంగ్రెస్ నేతలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పండి**
- **ఆ రెండు పార్టీల వల్లే తెలంగాణ ఏర్పాటులో ఆలస్యం**
- **రూ.900 కోట్ల విలువైన అభివృద్ధి పథకాలకు ప్రారంబోత్సవాలు**

వరంగల్: ఎన్నికల టైం కాబట్టి పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారని, కేవలం ఎన్నికలప్పుడు వచ్చే ఆ పొలిటికల్ టూరిస్టుల మాటల నమ్మి ఆగం కావద్దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు రాగానే సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు ప్రతిపక్షాలు వస్తాయని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు.. కేసీఆర్ పథకాలను కాపీకొట్టి, నాలుగు ఓట్లు డబ్బాలో వేయించుకోవాలని ప్రయత్నం చేసేవారిని అస్సలు నమ్మవద్దని కోరారు. స్కీములు అమలవుతున్న తెలంగాణలో 'స్కాములు'చేసేందుకు వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు, వచ్చాక ఎలా ఉందో గమనించాలని, కులమత భేదాలు లేకుండా అడగకున్నా ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చింది కేసీఆరేనని, మళ్లీ వచ్చేది, ఇచ్చేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కేటీఆర్ శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరంలో సుడిగాలి పర్యటన చేశారు.

హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రైసిటీలో సుమారు రూ.900 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంకోత్సవాలు చేశారు. మడికొండలో క్వాడ్రంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ 'కుడా'మైదానంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన,

# కృష్ణా జలాలపై హక్కులను పరిరక్షించండి

అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించకుండా పరిరక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతుర్రాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడ ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ షేరింగ్ డిస్‌ప్యూట్స్) చట్టం-1956లో సెక్షన్‌1 ప్రకారం కొనుసాగుతున్న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)%--%2కు మరిన్ని విధి విధానాల జారీకి బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం 2014 జూలై 14న చేసిన ఫిర్యాదు ప్రకారం ఈ విధి విధానాలను కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఆ విధి విధానాల నుంచి కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లోని మిగతా రెండు రాష్ట్రాలను (మహారాష్ట్ర, కర్ణాటక) పూర్తిగా మినహాయించి.. రెండు రాష్ట్రాలకే (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పరిమితం చేయాలని ఏకపక్షంగా సూచించడం అశాస్త్రీయం అని చెప్పారు. దీంతోపాటు జాతీయ సంపద అయిన జల వనరులను న్యాయ బద్ధంగా వినియోగించుకోవడానికి కూడా విరుద్ధమని స్పష్టం చేశారు.

# రెండేళ్లలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తెలిపారు. నక్సల్స్‌కు వ్యతిరేకంగా 2015నుంచి కేంద్రం అనుసరిస్తున్న 'జాతీయ విధానం- కార్యాచరణ ప్రణాళిక' అనే విధానం ఇటీవలి సంవత్సరాల్లో గణనీయమైన విజయాలు అందిస్తోందన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్‌షా ప్రసంగించారు. మానవత్వం పాలిట శాపంగా మారిన నక్సలిజాన్ని అన్ని రూపాల్లోనూ తుడిచిపెడతామని ప్రకటించారు. "మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 195 పారామిలిటరీ బలగాల క్యాంపులను ఏర్పాటు చేశాం. త్వరలో కొత్తగా మరో 44 క్యాంపులను ఏర్పాటు చేస్తాం" అని ఆయన తెలిపారు. మావోయిస్టు సమస్య పునరావృతం కాకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని, ఇతర రాష్ట్రాల్లో ఆశ్రయం పొందకుండా పర్యవేక్షించాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డీజీపీలకు అమిత్‌షా సూచించారు. వామపక్ష తీవ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదన్నారు. ఇదే విధానంతో ముందుకెళ్లడం వల్ల మావోయిస్టుల హింసను గణనీయంగా తగ్గించగలగామని చెప్పుకొచ్చారు. "నాలుగు దశాబ్దాల కాలంలో 2022లో అత్యంత తక్కువగా నక్సల్ సంబంధిత హింస నమోదైంది. 2005 నుంచి 2014 మ?ధ్యకాలంతో పోల్చితే 2014 - 2023 మధ్యకాలంలో మావోయిస్టుల హింస 52 శాతం, మరణాలు 69 శాతం, భద్రతా బలగాల మరణాలు 72 శాతం, పౌరుల మరణాలు 68 శాతం తగ్గాయి" అని వివరించారు. వామపక్ష తీవ్రవాద ఉద్యమాలకు నిధుల ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు ఎన్ఐఏ, ఈడీ వంటి సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాయని అమిత్‌షా తెలిపారు. దీనికోసం పౌర, పోలీసుల భాగస్వామ్యంతో సంయుక్త బృందాలు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు ఆయన సూచించారు. మావోయిస్టు ప్ర?భావిత రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, రోడ్డు, టెలీ కమ్యూనికేషన్లు వంటి సౌకర్యాలను పెంచిందని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో 14 వేల కోట్లు విలువైన ప్రాజెక్టులను చేపడుతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జార?ండ్ సీఎం హేమంత్ సొరేన్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారు, కేంద్ర హోం శాఖ కార్యదర్శి,కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# కోర్టు పర్యవేక్షణలో ఆస్తులపై విచారణకు సిద్ధమా?

అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు నిజాయితీపరుడే అయితే కోర్టు పర్యవేక్షణలో మీ ఆస్తులపై విచారణకు సిద్ధమా? అని నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని(వెంకట్రామయ్య) సవాల్ విసిరారు. చంద్రబాబు నిజాయితీపరుడంటూ ఆయన కుటుంబం చెబుతున్న సొల్లు కబుర్లను కట్టిపెట్టాలన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. గంధపు చెక్కల దొంగ వీరప్పన్ తాను అడవులను సంరక్షిస్తున్నానంటూ నమ్మబలికినట్లుగానే ఖజానాకు కన్నం వేసి తాను ప్రజల కోసం పని చేస్తున్నానంటూ చంద్రబాబు ఇన్నాళ్లూ నీతులు వల్లించారన్నారు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబును కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపితే తల్లిని, భార్యను రాజమండ్రిలో రోడ్ల మీద వదిలేసి ఢిల్లీకి ఎందుకు పరిగెత్తావని లోకేశ్‌ను ప్రశ్నించారు. తండ్రిని రక్షించుకోవడానికి ఎవరి కాళ్లు పట్టుకోవడానికి ఢిల్లీకి వెళ్లావని నిలదీశారు. దేశంలో వ్యవస్థలను మేనేజ్ చేయడంలో మొనగాడు ఎవరని లోకేశ్ ఆయన డ్రైవర్‌ను అడిగినా చంద్రబాబు పేరే చెబుతారన్నారు. సీమెన్స్ ఇస్తుందని మీరు చెప్పిన రూ.3 వేల కోట్లు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలన్నారు. ఖజానా నుంచి కాజేసిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు సిగ్గు లేకుండా టీడీపీ ఖాతాలో వేసుకున్నారని ధ్వజమెత్తారు. పెడన సభలో ఎన్డీఏ నుంచి బయటకొచ్చానని ప్రకటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముదినేపల్లికి వచ్చేసరికి మాట మార్చారని పేర్ని నాని గుర్తు చేశారు. 'నువ్వు ఎన్డీఏలోనే కొనసాగుతుంటే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చావ్? తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో సంప్రదించకుండా ఏకపక్షంగా 32 సీట్లలో పోటీ చేస్తున్నామని, గ్లాస్ గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని ఎందుకు కోరావ్?' అని పవన్‌ను నిలదీశారు. తెలంగాణలో మున్నూరు కాపులు ఉన్న చోటే ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సూచించిన మేరకే ఆ స్థానాల్లో పోటీ చేస్తున్నావా? అని నిలదీశారు.

**రాష్ట్రానికి మహమ్మారులు పవన్, చంద్రబాబే**

'జనసేనను స్థాపించాక 2014 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చావ్. తమను బీసీల్లో చేర్చుతామన్న హామీని నిలబెట్టుకోని చంద్రబాబుపై కాపులు ఆగ్రహంతో ఉన్నందున వారి ఓట్లను చీల్చేందుకు 2019లో విడిగా పోటీ చేశావ్. ఎన్నికలు పూర్తవగానే బీజేపీ పంచన చేరావు. చంద్రబాబు జైలుకు వెళ్లగానే టీడీపీతో కలిసి పోటీ చేస్తానని ప్రకటించావ్. దీన్ని బట్టి చంద్రబాబుకు అమ్ముడుపోయే నిన్ను ప్యాకేజీ స్టార్ అనక మరేమంటారు సన్నాసిన్నర సన్నాసి..!' అంటూ పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రానికి పట్టిన మహమ్మారులు చంద్రబాబు, పవన్

# 60 రోజుల్లోనే ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కాషాయజెండా రెపరెపలాడించడం ఖాయం. కేసీఆర్ అవినీతి, కుటుంబపాలనను సమాధి చేద్దాం' అంటూ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటడిగే అర్హత లేదు**

'తెలంగాణ సాధనలో ఎంతో మంది చనిపోవడానికి కాంగ్రెస్ సర్కార్ కారణం. తెలంగాణలో ఓటు అడిగే అర్హత ఆ పార్టీకి లేదు. బీజేపీ లేకుంటే.. సుష్మాస్వరాజ్ మద్దతివ్వకుంటే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ అయ్యేదా.? బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కేసీఆర్ ఓటింగ్‌లో పాల్గొన్నాడా? అలాంటి వ్యక్తికి తెలంగాణను ఏలే హక్కు లేదు' అని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కొన్ని కుక్కలు ట్విట్టర్‌లో మొరుగుతున్నాయి. తండ్రిని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చిన నాయకుడి స్థాయి ఎంత ? చదివింది అమెరికాలో.. థర్డ్ గ్రేడ్ లత్కోర్ మాటలు మాట్లాడుతున్నారు' అని కేటీఆర్‌ను ఉద్దేశించి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి వంతపాడడం మజ్లిస్‌కు అలవాటని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు సూట్ కేసులతో దారుసలాం వెళ్లి అసదుద్దీన్‌కు వంగివంగి దండాలు పెట్టి.. తమ దగ్గర ఎంఐఎం అభ్యర్థిని పోటీలో పెట్టొద్దని బతిమాలుతున్నారన్నారు. నల్లగొండ, ముథోల్, భైంసా, నిర్మల్, ఆదిలాబాద్ తదితర చోట్ల మజ్లిస్ మతరాజకీయాలు రగిలించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

**రాష్ట్ర కౌన్సిల్‌లో ఎవరేమన్నారంటే..**

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మీడియాకు చెప్పారు. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు అందించిన సంక్షేమ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతినిధులకు తెలియజేశారు

# ఎవరేం చేశారో తేల్చుకుందామా?

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): "60 ఏళ్లలో చేసిన అప్పు రూ.69 వేల కోట్లు అయితే.. 9 ఏళ్లుగా కేసీఆర్ చేసిన అప్పు రూ.5.5 లక్షల కోట్లు. రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే.. ఇవాళ లక్షల కోట్ల లోటు బడ్జెట్ చేశాడు. అప్పుల్లో ముంచేశాడు. 2004 నుంచి 2014 వరకు ఏం చేశామో ప్రోగ్రెస్ కార్డు తీసుకొని వస్తాం. 2014 నుంచి ఇప్పటి వరకు బీఆర్ఎస్ ఏం చేసిందో బహిరంగంగా చర్చ పెడతాం. ఒకవేళ మాకంటే వాళ్లు బాగా చేశారంటే వాళ్లు విధించిన శిక్షకు మేం సిద్ధం. అలా కాకపోతే వాళ్లు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఈ సవాలుకు మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ సిద్ధంగా ఉంటే.. తేదీ చెబితే మేం ఎక్కడికైనా వస్తాం" అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎసకు రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, నాగర్ కర్నూలు జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పలువురు ఎంపీపీలు, సర్పంచులు శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వారికి కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్ తనను మరుగుజ్జు అనడంపై, 11 సార్లు చాన్స్ ఇచ్చినా కాంగ్రెస్ ఏమీ చేయలేదని అనడంపై తీవ్రంగా స్పందించారు. "కాంగ్రెస్ ఏం చేసిందో ఇంటికెళ్లి మీ అయ్యను అడుగు. మీ అయ్యకు యూత్ కాంగ్రెసలో అవకాశం ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఎమ్మెల్యే కాకముందే హరీశ్ రావును 2004లో మంత్రిని చేసింది. కాంగ్రెస్ దయదలిచి.. సోనియా గాంధీ బిచ్చమేస్తే హరీశ్ మంత్రి అయ్యారు. రబ్బర్ చెప్పులతో తిరిగే హరీశ్ రావుకు ఈరోజు విమానాల్లో తిరిగే పరిస్థితి వచ్చిందంటే అది సోనియా వేసిన భిక్ష. కేటీఆర్ మమ్మల్ని మరుగుజ్జులు అంటున్నారు. నీ అయ్య పెద్ద బాహుబలినా? ఎప్పుడన్నా అద్దం ముందు నిలబడి చూసుకున్నాడా? అమెరికాలో బాత్‌రూములు కడుక్కునే నిన్ను ఇండియాకు తీసుకొచ్చి ఎమ్మెల్యేను.. మంత్రిని చేసింది కాంగ్రెస్ పార్టీయే. కాంగ్రెస్ సహకరించి ఉండకపోతే బిర్లా మందిర్ లేదా నాంపల్లి దర్గా దగ్గర మీ కుటుంబం మొత్తం బిచ్చం ఎత్తి బతికేవాళ్లు" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ, రైతు రుణ మాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, జలయజ్ఞం పేరిట ప్రాజెక్టులు వంటి పథకాలను అమలు చేసిందని, అప్పట్లో ఆ పథకాలు మిగతా రాష్ట్రాల్లో లేవని గుర్తు చేశారు. రాష్ట్రాలకు వచ్చే ఆదాయం ప్రకారం సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నిర్ణయం జరుగుతుందని, జాతీయ పార్టీలు అన్ని రాష్ట్రాల్లో ఒకే పథకాన్ని అమలు చేయాలంటే ఇక వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్రాలే అవసరం లేదని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు ఈ ఇంగిత జ్ఞానం కూడా లేదని దుయ్యబట్టారు. "సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మీరు కల్వకుర్తి, కొడంగల్, కొల్లాపూర్ వంటి ఇతర నియోజక వర్గాల్లో అమలు చేస్తున్నారా? తెలంగాణలోనే సమానమైన అభివృద్ధి చేయని సన్నాసులు ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన గురించి మాట్లాడుతున్నారు. ఛత్తీసగఢ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటకల్లో అక్కడి ఆదాయం.. ప్రజల అవసరాల మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నాం. ఇవేమీ తెలియని బిల్లారంగాలు ఊర్ల మీద పడి పిచ్చికుక్కల్లా మా పార్టీని తిడుతున్నారు. గత పదేళ్లలో ఏం చేశారో చెప్పుకోడానికి ఏమీ లేదు. అందుకే సీఎం కేసీఆర్ ముఖం చెల్లక.. ప్రజలకు ఏం చెప్పాలో తెలియక ఫామ్‌హౌజ్‌లో పడుకుంటే.. ఈ బిల్లారంగాలు ఇద్దరూ ఊళ్ల మీద పడి చిత్తకార్తిలో కుక్కల్లా తిరుగుతున్నారు" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మరుగుజ్జులు ఎవరో, ప్రజలు ఎవరిని ఆదరిస్తారో రాబోయే 45 రోజుల్లో తేలబోతోందని, వాళ్లను ఊచలు లెక్కపెట్టిస్తానని హెచ్చరించారు. "అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.100 కోట్లతో టెండర్ పిలిచారు. ఆ తర్వాత దానిని రూ.200 కోట్లకు పెంచారు. రూ.64 కోట్లతో టెండర్లు పిలిచిన అమరవీరుల స్తూపం ఖర్చు రూ.200 కోట్లకు చేరింది. రూ.400 కోట్లతో నిర్మిస్తామన్న సచివాలయం వ్యయాన్ని రూ.1400 కోట్లకు పెంచారు. అమరవీరుల స్తూపం నిర్మాణంలో కూడా దోపిడీకి పాల్పడ్డారు. ఇలాంటి నీచమైన మనస్తత్వం ఉన్నవాళ్లు, నీచులు తెలంగాణ సమాజంలోనే లేరు. వారివల్ల తెలంగాణకు చెడ్డపేరు వస్తోంది" అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అందుకే వాళ్లను ఓడించడానికి ప్రజలు ముందుకొచ్చారని, అందులో భాగంగానే ప్రజాభిప్రాయాన్ని గౌరవించి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని చెప్పారు. కేటీఆర్ చుట్టూ ఉన్నవాళ్లు, వాళ్ల బంధువులు ఇతర దేశాల పాస్‌పోర్టులు తీసుకున్నారని, దేశ ప్రజలకు, ప్రభుత్వానికి చెప్పకుండా ఈ సమాచారాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. దేశం విడిచిపెట్టి పారిపోవడానికి రెండు పాస్‌పోర్టులు తీసుకున్నారని తెలిపారు. ఈ అన్ని అంశాలపై అధికారంలోకి వచ్చిన మరుక్షణమే విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేశారు. కాగా, అంబలిలో తెడ్డులా బీజేపీ వ్యవహరిస్తోందని, ఆ పార్టీకి అభ్యర్థులే లేరని, మేనిఫెస్టో కూడా లేదని తప్పుబట్టారు. బీజేపీ స్టీరింగ్ అదానీ చేతిలో ఉంటే.. బీఆర్ఎస్ స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉందని విమర్శించారు. కాగా, తమకు సముచిత స్థానం కల్పించాలని వివిధ సామాజిక వర్గాలు పార్టీకి విజ్ఞప్తి చేస్తున్నాయని, టికెట్లు ఇవ్వదగిన దగ్గర టికెట్లు ఇస్తామని, ప్రత్యామ్నాయ పదవులు కూడా ఇస్తామని తెలిపారు.

# వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ అధినేతపై ఎందుకీ నిర్బంధమని ఆయన ప్రశ్నించారు. "ఎందుకీ నిర్బంధకాండ? నాలుగున్నరేళ్లుగా ఈ ప్రభుత్వం చేసిన తప్పులన్నీ బయటకు తీసుకొచ్చినందుకా?, ప్రజల తరఫున నిరంతరం పోరాడుతున్నందుకా? పోలవరం గురించి మాట్లాడుతున్నందుకా? నిరుద్యోగ యువతకు ఉద్యోగాలకోసం పరిశ్రమలు తీసుకురమ్మని అడిగినందుకా? ఆంధ్ర రాష్ట్రానికి జలాలు తీసుకుని రావాలని నిలదీసినందుకా?వాళ్లు చేస్తున్న ఇసుక, మద్యం, మైన్స్ అవినీతిపై ప్రశ్నించినందుకే చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌లో నిర్బంధించారు" అని లోకేశ్ అన్నారు. తల్లి భువనేశ్వరి, సతీమణి బ్రాహ్మణితో కలిసి శుక్రవారం ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న చంద్రబాబును ములాఖత్‌లో కలిశారు. అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసే ముందు రూ.3వేల కోట్ల అవినీతి జరిగిందని ప్రభుత్వం వాదించింది. అరెస్ట్ చేసిన తర్వాత కాదు కాదు.. రూ.371 కోట్లని మాట మార్చారు. ఇవాళ కోర్టులో రూ.27కోట్లే అవినీతి జరిగిందని మరోసారి మాట మార్చారు. చివరకు అవినీతి ఏమీ లేదు...అంతా సున్నాయే అని చెప్పే రోజుకూడా వస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

"1992లో ఓ సంస్థను స్థాపించి నా తల్లి భువనేశ్వరి, ఆ తర్వాతకాలంలో నా భార్య బ్రాహ్మణి నీతినిజాయితీలతో కష్టపడి దానిని లాభాల్లోకి తెచ్చారు. ఆ డబ్బులు ఖర్చుచేసి మేం రాజకీయాలు చేస్తున్నాం. ఏ రాజకీయ కుటుంబమూ చేయని విధంగా మా ఆస్తులు ఏటా స్వచ్ఛందంగా మేం ప్రకటిస్తున్నాం. మేం ప్రకటించిన ఆస్తులకంటే ఒక రూపాయి ఎక్కువ ఉందని నిరూపించినా, మా ఆస్తి మొత్తం రాసిస్తానని కూడా చెప్పాను. కానీ నిరూపించలేకపోయారు. చంద్రబాబు సీఎం హోదాలో ఒక్క చిటికేసి ఉంటే పిచ్చి జగన్ రోడ్డుపై తిరిగి పాదయాత్ర చేసేవాడా?"

**అది మా కార్యకర్తల మెంబర్‌షిప్ నగదు...**

"2014, 2016, 2018ల్లో పార్టీ సభ్యత్వాలు చేశాం. కరోనా సమయంలో చేయకపోయినా తర్వాతమళ్లీ సభ్యత్వాలు చేశారు. సభ్యత్వ రుసుం కింద ఒక్కొక్కరి నుంచి రూ.100 తీసుకున్నాం. 1300 బ్రాంచీల్లో మా కార్యకర్తలు రుసుం సొమ్మును జమచేశారు. ఆ డబ్బులు టీడీపీ మెయిన్ అకౌంట్‌కు వచ్చాయి. ప్రమాదంలో చనిపోయిన మా పార్టీ వారికి అందులోంచి రూ.110కోట్ల ప్రమాద బీమా సొమ్ము అందించాం"

**గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం**

"చంద్రబాబుపై మోపిన తప్పుడు కేసులపై శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నాం. గుడ్డి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం. నేను ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతితోపాటు అనేకమంది ముఖ్యనేతలను కలిశాను. వారంతా సంఘీభావం తెలిపారు. చంద్రబాబు తప్పు చేసే వ్యక్తి కాదని అన్నారు. టీడీపీ అ?ధికారంలో ఉన్నప్పుడు వైసీపీకి ఎలక్టోరల్ బాండ్లు ఎక్కువ వచ్చాయి. వంద కోట్ల వరకు వైసీపీకి వచ్చాయి. ఆ వంద కోట్లను వైసీపీకి ఎవరిచ్చారో ఏసీబీ బయటపెట్టగలదా? నిరంతరం ప్రజలకు సేవ చేయాలని ఆలోచించే వ్యక్తి చంద్రబాబు. కానీ జగన్ నిరంతరం కేసుల మాఫీ కోసం ఆలోచించే వ్యక్తి. చివరకు కేసుల మాఫీ కోసం కృష్ణా జలాలను తాకట్టుపెట్టారు. ఈ విషయం తెలిసి చంద్రబాబు చాలా బాధపడ్డారు" కార్యకర్తల నుంచి అధినేత వరకూ అందరి మీద కేసులుపెట్టడం ద్వారా ఎన్నికలకు సమాయత్తం కాకుండా చేయాలన్నదే జగన్‌రెడ్డి కుట్ర. అతను ప్రజల నమ్మకం పూర్తిగా కోల్పోయాడు.

# మళ్లీ వచ్చేది ఇచ్చేదీ కేసీఆరే

(మొదటి పేజీ తరువాయి)

ఖిలా వరంగల్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే నరేందర్ అధ్యక్షతన జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభల్లో ప్రసంగించారు.

**వంచించాలని చూస్తే పుట్టగతులుండవ్..**

తెలంగాణ ప్రజలను ఇంకా మాయమాటలతో వంచించాలని చూస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పుట్టగతులుండవని కేటీఆర్ హెచ్చరించారు. 60 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని కాంగ్రెస్ వాళ్లు ఇప్పుడు ఏదో చేస్తామంటే ఎలా నమ్ముతామని, అధికారం ఉన్నచోట అభివృద్ధిని విస్మరించిన బీజేపీ ఇక్కడేమి చేస్తుందని ప్రశ్నించారు. అధికారం కోసం ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. 'చరిత్రలో వాస్తవాలు దాచినా దాగవు. 1956లో హైదరాబాద్ సంస్థానం ఒక రాష్ట్రంగా ఉంటే.. బలవంతంగా తీసుకుపోయి ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్సే. 1968లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఖమ్మం, వరంగల్‌లో అందరూ కలిసి కదం తొక్కితే ఆ రోజు కర్కశకంగా 370 మంది పిల్లల్ని పిట్టల్లా కాల్చి చంపింది. 30 ఏళ్ల తర్వాత 2001లో గులాబీ జెండా ఎగిరితే అదిరిపోయి కాంగ్రెస్ తెలంగాణ నినాదాన్ని అందుకుంది. తెలంగాణ ఇస్తామని నమ్మబలికి 2004లో పొత్తు పెట్టుకుని 2014 వరకు పదేళ్లు చావగొట్టింది. వేలమంది చావులను కళ్ల చూసిన తర్వాత.. మీ అందరి పోరాటంతో ప్రజాశక్తి ముందు తలవంచక తప్పని పరిస్థితి వస్తే అనివార్యంగా కాంగ్రెస్, బీజేపీ కలిసొచ్చాయి. విధిలేని పరిస్థితుల్లోనే తెలంగాణ జపం చేశాయి..'అని కేటీఆర్ చెప్పారు.

**ఉద్యమానికి ఊపిరిలూదింది ఓరుగల్లే..**

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి ఊపరిలూదింది ఓరుగల్లు గడ్డే. మీ అందరికీ రుణపడి ఉంటాం. వరంగల్‌లో 24 అంతస్తుల్లో అతిపెద్ద ఆస్పత్రి నిర్మిస్తున్నాం. దసరా నాటికి అది పూర్తవుతుంది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత అన్ని జిల్లాల్లో బ్రహ్మాండంగా మెడికల్ కాలేజీలు వచ్చాయి. ప్రభుత్వ ఖర్చుతో మన పిల్లలు డాక్టర్లు అయ్యే పరిస్థితి ఏర్పడింది. త్వరలోనే సీఎం శుభవార్త చెబుతారు. ఆసరా పెన్షన్లు ఎంతో పెంచబోతున్నామో స్వయంగా కేసీఆరే ప్రకటిస్తారు. కేసీఆర్ మత రాజకీయం చెయ్యరు. ఆయన అన్ని మతాలను సమానంగా చూసే నాయకుడు..'అని మంత్రి అన్నారు.

**భవిష్యత్ అంతా ద్వితీయ శ్రేణి నగరాలదే..**

'దేశంలో భవిష్యత్ అంతా ద్వితీయశ్రేణి నగరాలదే. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌కు వరంగల్‌కు తేడా ఉండదు. మడికొండ ఐటీ పార్కులో నూతనంగా నిర్మించిన క్వాడ్రంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుంది. స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం వరంగల్, ఖమ్మం, నల్లగొండ వంటి నగరాలు, పట్టణాలకు పరిశ్రమలు తీసుకువస్తోంది. వరంగల్‌లోనే కాదు ఏపీలోని భీమవరం, నెల్లూరుకూ ఐటీ సంస్థలు రావాలి. అక్కడా ఐ టీ సంస్థలు పెట్టాలని ఎన్నారైలను కోరుతున్నా. కావాలంటే జగనన్నకు చెప్పి నేను మీకు జాగా ఇప్పిస్తా. బెంగళూరు ఐటీ రంగంలో 40 శాతం తెలుగువాళ్లే. అక్కడి నుంచి వచ్చేందుకు తెలుగు ఐటీ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. ఉన్నచోటే మన యువతకు ఉపాధి దక్కేలా చూద్దాం..'అని కేటీఆర్ అన్నారు.

# మహిళా బంధు ముఖ్యమంత్రి కెసిఆర్

### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల టౌన్/సమ సమాజం:** జగిత్యాల పట్టణ దేవి శ్రీ గార్డెన్స్ లో పట్టణానికి చెందిన ఆడబిడ్డలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా బంధు ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. మహిళలు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు రాష్ట్రం లో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహిళల కోసం కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి, న్యూట్రిషన్ కిట్ ,ఆరోగ్య మహిళ ,గృహలక్ష్మి పథకం, డబల్ బెడ్రూమ్ ఇల్లు తదితర కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. విద్య, వైద్యనికి రాష్ట్రంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కేసిఆర్ సారథ్యంలో ప్రజలు భరోసా ఏర్పడ్డదని అన్నారు. కుల మత బేధం లేకుండా అన్ని వర్గాల పండగలను ప్రభుత్వ పథకాలు నిర్వహిస్తూ, శాంతియుత వాతావరణంను తెలిపారు. బతుకమ్మ చీరలు పంపిణీ భేద మధ్య తరగతి ప్రజలకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,కమిషనర్ అనిల్ బాబు,కౌన్సిలర్ లు క్యాదాసు నవీన్, పంబాల రామ్ కుమార్,కూతురు రాజేష్ ,పిట్ట ధర్మరాజు,బోడ్ల జగదీష్,కోరే గంగ మల్లు,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,ఉప అధ్యక్షుడు వొల్లెం మల్లేశం, నాయకులు కృదసు నాగయ్య, వీరబత్తిని శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాలు పెంపునకే అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం.







### జడ్పి చైర్ పర్సన్ దావా వసంత.

### అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**జగిత్యాల, సమ సమాజం:**విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులు, విద్యా ప్రమాణాల పెంపులను మానవీయ కోణంలో ఆలోచించి ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిన సి.యం. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు ధన్యవాదాలు తెలపాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు.జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభించిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనతతో బాధపడకుండా పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ పథకం ద్వారా అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దే క్రమంలో మధ్యాహ్నం భోజనం కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రారంభించి సన్న బియ్యం ద్వారా భోజనాన్ని అందించడం జరుగుతుంది. మధ్య, పేద తరగతి కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పనులు నిర్వహిస్తూ, విద్యార్థులకు మౌళిక సదుపాయాలు అందించడం జరుగుతుందని, పేదలకు అందుబాటులో విద్యా,వైద్యం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు . ప్రభుత్వం, విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలని చైర్ పర్సన్ దావా వసంత అన్నారు.

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలని, తెలంగాణ తేజస్సులుగా విద్యార్థులు ఎదగాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు వెచ్చిస్తూ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు అందించడం జరుగుతున్నదని అన్నారు. జిల్లాలో మొదటి దశలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద 274 పాఠశాలల్లో పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆంగ్ల బోధన అభ్యాసం చేయడం, తొలి మెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థులు బోధన, విద్యాభ్యాసం లను పరిశీలించి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులను ఏర్పాటు చేసి విద్యా బోధన అందించడం జరుగుతున్నదని, అల్పాహారం పథకం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం కలిగి నాణ్యమైన విద్య అభ్యసించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం అమలును పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీలు, సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన విధానంతో అల్పాహార పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుండి ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మార్పు వలన విద్యార్థుల సంఖ్య పెరగడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో 48 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఆయన తెలిపారు. ఉన్నత విద్యా, విదేశీ విద్యా ఫీజు రియంబర్స్ మెంట్ కార్యక్రమాలను విద్యార్థులకు అందించడంతో పాటు వ్యవసాయ కళాశాలను జిల్లాలో ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని జెడ్పి చైర్ పర్సన్, కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు అందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, మున్సిపల్ కమీషనర్ అనిల్ బాబు, జిల్లా విద్యా శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాటశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలకు చర్యలు.







### మంత్రి తన్నీరు హరీష్ రావు.

### కోరుట్లలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి.

**జగిత్యాల, సమ సమాజం:**ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి. హరీష్ రావు అన్నారు. కోరుట్ల పట్టణంలో రూ. 16.80 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి భవనాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఆసుపత్రిలో రోగులకు చికిత్సలు అందించేందుకు అవసరమైన మెటీరియల్ సరఫరా చేస్తామని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ ధావ వసంత, ఎమ్మెల్యే కే. విద్యాసాగర్ రావు, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీధర్, డా. సుదీక్షనదేవి, వైద్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం బోటింగ్ ఏర్పాటు.

### ,జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ, చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. కోరుట్ల పట్టణంలోని మదుల చెరువు మినీ ట్యాంక్ బండ్ లో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత , ఎమ్మెల్యే కే.విద్యాసాగర్ రావు లతో కలిసి బోటింగ్ ను ప్రారంభించారు. ఈ చెరువులో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేయవచ్చని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిదులు బోటింగ్ లో విహరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, మునిసిపల్ చైర్ పర్సన్ లావణ్య, పర్యాటక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐటిఐ స్నాతకోత్సవం

**పరకాల అక్టోబర్ 6 సమ సమాజం:**శుక్రవారం పరకాల పట్టణం లోని శ్రీనివాస ఐటిఐ కళాశాల ఛైర్మెన్ చిట్ల శ్రీనివాస్ బాబు నేతృత్వం లో జరిగిన స్నాతకోత్సవం. ఘనంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, ఎఫ్ ఏ సి ప్రిన్సిపాల్ పివీ రావు హాజరై, పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేసి మాట్లాడుతూ ఐటిఐ లో వృత్తిరీత్యా కోర్సులు నేర్చుకోవడం వలన భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు పొందుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాచర్ల రవీందర్ ఇన్స్ట్రక్టర్స్ దాసరి ఓంప్రకాశ్, భీమేశ్వర్ ధనుష్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.




# అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల టౌన్/ సమ సమాజం:** జిల్లా కేంద్రం లోని ఎస్ కె ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఖాళీగా అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ ఒక ప్రకటనలో సూచించారు. కళాశాలలో కామర్స్ 02, కంప్యూటర్స్ 01, ఇంగ్లీషు 02, తెలుగు 02 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందుకు గాను పీజీ లో ఓసీ, బీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులు, ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండి నెట్, సెట్, పీ.హెచ్ డి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని అన్నారు. బోధనానుభవం ఉన్న అభ్యర్థులకు వెయిటేజీ ఇవ్వబడునని అన్నారు. ఇందుకు గాను అర్హులైన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం 4.30 గంటల లోగా తమ దరఖాస్తులను సమర్పించవలెనని, 11వ తేదీ ఉదయం 10 గంటలకు దరఖాస్తుల పరిశీలన కొరకై ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావలెనని కోరారు.

# మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు అందించే చీరల పంపిణీ కార్యక్రమన్నీ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంగం స్వరూప మహేష్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ.ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించిన అనంతరం సిరిసిల్ల చేనేత కార్మికుల కుటుంబాలలో వెలుగులు వచ్చాయని అన్నారు.అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ బతుకమ్మ కానుకలుగా చీరలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు.అన్ని మతాలను అన్ని కులాలను సంప్రదాయాలను గౌరవిస్తున్న రాష్ట్ర ప్రభుత్వనికి సీఎం కేసీఆర్ కు దాన్యవధాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎపిడిఓ శంకర్,ఆలయ చైర్మన్ కొమిరె శంకర్,ఆలయ కోశాధికారి నాగులపెల్లి రవీందర్,వార్డ్ మెంబర్ మ్యాకాల రాజేందర్, నాయకులు పుదారి శ్రీనివాస్, ఏపీఎం రాజు,అదికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేరా ఓబన్న వర్ధంతి వేడుకలు



స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు గొళ్ళెం నర్సింగ్ ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్థులు మాట్లాడుతూ.తెల్ల దొరల వెన్నులో వణుకు పుట్టించిన ఘనత వడ్డే ఒబన్నదని అన్నారు.రేనాటి విరుడిగా,వడ్డెర ముద్దుబిడ్డగా, స్వతంత్ర సమరయోధుడిగా వడ్డే ఒబన్న వడ్డెర ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు.ప్రస్తుతం ఉన్న వడ్డెరలు ఓబన్న దేశం కోసం చేసిన సేవలను తెలుసు కోవాలని కోరారు.యువత ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో,గొళ్ళెం శేఖర్, గొళ్ళెం కుమార్,బోదసు గంగరాజం,శివరాత్రి రత్నం,గుంజే రాజేష్, జలందర్,రాఘవ్,ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానించిన ఎంపిపి



ఇటీవల విడుదలైన పలితాల్లో నలుగురు యువకులు కానిస్టేబుల్ గా ఉద్యోగాలు సాధించిన సందర్భంగా ఎంపిపి గంగం స్వరూప మహేష్ ఆధ్వర్యంలో యువకులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ,రుద్రంగి గ్రామానికి చెందిన ఆకుల నవీన్,బాసాని సూర్య ప్రకాష్,తోకల శశిధర్,నేదురి నవీన్,అనే నలుగురు యువకులు పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగలు సాధించడం రుద్రంగి మండలానికె గర్వకారణం అని అన్నారు.యువకులు టైం వృధా చేయకుండా వీరిని ఆదర్శంగా తీసుకొని బాగా చదివి ఉద్యోగాలు సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత క్రీడల్లో రాణించిన యువకులకు కూడా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు.మొబైల్ ఫోన్ తో యువత టైం వృధా చేయాయకుండా బాగా చదువుతూ క్రీడల్లో కూడా రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేష్, పిఈటీ గాజుల వేణు,అంబటి శ్రీనివాస్,నాయకులు పుదారి శ్రీనివాస్,నాగులపెల్లి రవీందర్,సింగరపు గంగారెడ్డి, గణేష్,దయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్ష్ కిట్టును అందజేసిన జిన్నారం ఎంపీపీ

**జిన్నారం అక్టోబర్ 6:సమ సమాజం:** జిన్నారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ రవీందర్ గౌడ్ స్పోర్ట్స్ కిట్టు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న యువతి యువకులు క్రీడారంగంలో మంచి నైపుణ్యం సాధించి గ్రామాలకు, జిన్నారం మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. ఈ స్పోర్ట్స్ కిట్స్ తో రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో యువతీ యువకులు ముందుకెళ్లి పథకాలతో ప్రశంసలతో జిన్నారం మండలాన్ని, గ్రామాలను మొదటి స్థానంలో తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అనంతరం నల్తూరు గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ రాములు గ్రామపంచాయతీ కార్యదర్శులు, నల్తూరు సర్పంచ్ జనార్ధన్, ఉపసర్పంచ్ రమేష్, నాయకోటి లక్ష్మణ్, పద్మారావు, సురేష్, అది మల్లేష్, యనగండ్ల నరేందర్, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చుతున్న సీఎం కేసీఆర్

**అంబేద్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు**

**మహిళా హక్కుల కోసం అంబేద్కర్ కృషి మరువలేనిది**

**సమ్మిళిత భారతదేశ నిర్మాణం కోసం అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దాం**

**మహిళా రిజర్వేషన్ల చట్టం పోస్ట్ డేటెడ్ చెక్కు లాంటిది**

**లండన్ లో అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించిన కల్వకుంట్ల కవిత**





లండన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రమే నెరవేరుస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. లండన్ పర్యటనలో ఉన్న కల్వకుంట్ల కవిత శుక్రవారం నాడు అక్కడి అంబేద్కర్ మ్యూజియాన్ని సందర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ అంబేద్కర్ అండ్ బుద్ధిస్ట్ అసోసియేషన్ యూకే సంయుక్త కార్యదర్శి శామ్ కుమార్ ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.... అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందుగానే ఊహించి దూర దృష్టితో రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను చేర్చారని చెప్పారు. తనకు అంబేద్కర్ అంటే ఆదర్శమని అన్నారు. హైదరాబాదు నడిబొడ్డున సీఎం కేసీఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయించడమే కాకుండా కొత్తగా నిర్మించిన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారని, అంబేద్కర్ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. అసెంబ్లీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో తాను 48 గంటల పాటు నిరాహార దీక్ష చేశానని గుర్తు చేశారు. ప్రజల కోసం మరింత పనిచేయాలని ఆదర్శాన్ని ఇచ్చేటటువంటి ఆహార్యం అంబేద్కర్ దని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ మేధావిగా పేరు తెచ్చుకున్న అంబేద్కర్ కేవలం దళితుల కోసం మాత్రమే పాటుపడలేదని, మహిళల హక్కుల కోసం కూడా ఆయన కృషి చేశారని తెలిపారు. పలు దేశాల్లో ఓటు హక్కు కోసం మహిళలు పోరాటం చేస్తున్నారని, కానీ భారతదేశంలో దూర దృష్టి కలిగిన నాయకులు అంబేద్కర్, జవహర్లాల్ నెహ్రూ వంటి వారి వల్ల రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుంచే మహిళలకు ఓటు హక్కు కలిగిందని వివరించారు. అంబేద్కర్ అంతర్జాతీయంగా ప్రభావితం చేశారని, ముఖ్యంగా మహిళా హక్కుల పట్ల అండగా నిలబడ్డారని చెప్పారు. దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పార్లమెంటులో కేవలం 15 శాతం మాత్రమే మహిళల ప్రాతినిధ్యం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని మహిళా రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించానని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, పార్లమెంటులో రానున్న రోజుల్లో 181 మంది మహిళలను చూడబోతున్నామని చెప్పారు. సమ్మిళిత భారతదేశ నిర్మాణం కోసం అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించలేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు కోట కల్పించలేదని, ఓ బి సి మహిళలకు రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ల అమలుతో కేంద్ర ప్రభుత్వం జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెట్టిందని, కాబట్టి రానున్న ఎన్నికల్లో ప్రయోజనం పొందాలన్న ప్రయత్నంలో భాగంగానే బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకొచ్చిందని అనుమానం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లు పోస్ట్ డేట్ చెక్కులా ఉందని విమర్శించారు. చెక్కు పై తేదీ లేదు కాబట్టి రిజర్వేషన్లు ఎప్పుడు అమలు అవుతావన్నది ఇంకా ప్రశ్నార్థకంగానే ఉందని స్పష్టం చేశారు. యూకే భారత్ సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని తెలిపారు. చట్టాలు, శాసనాలు, చరిత్ర సంస్కృతి వంటివి రెండు దేశాలు చాలావరకు పంచుకొని ఉన్నాయని చెప్పారు.

# ఇన్నేళ్ళకు న్యాయం!

మూడు దశాబ్దాల పైచిలుకు క్రితం కేసులో బాధితులకు ఎట్టకేలకు కాసింత ఊరట దక్కింది. పోలీసుల దమనకాండకు ప్రతిరూపమైన తమిళనాడు వాచాత్తి ఘటనలో సెప్టెంబర్ 29న మద్రాస్ హైకోర్ట్ ఇచ్చిన తీర్పు ఆ రకంగా చిరకాలం గుర్తుండిపోతుంది. మారుమూల గ్రామంలోని గిరిజనులపై దాడి చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణమైన కేసు అది. అటవీ, పోలీసు అధికారులతో సహా మొత్తం 269 మంది దోషులంటూ కింది కోర్టు ఏనాడో తీర్పు ఇచ్చింది.

దోషులు పైకోర్టును ఆశ్రయించి, జాగు చేశారు. తాజాగా మద్రాస్ హైకోర్ట్ ఆ అప్పీళ్ళను కొట్టివేసింది. కింది కోర్ట్ తీర్పును హైకోర్ట్ సమర్థించడమే కాక, 215 మందినీ దోషులుగా తీర్మానిస్తూ, ఒక్కొక్కరికీ 1 నుంచి 10 ఏళ్ళ పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. బాధితులకు ఇన్నాళ్ళకైనా న్యాయం దక్కిందనే భావన కలుగుతోంది. ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల నమ్మకం మిగులుతోంది. నిజానికి, తమిళనాట ధర్మపురి జిల్లాలో తూర్పు కనుమల్లో నెలకొన్న గిరిజన గ్రామం వాచాత్తి గురించి ముప్ఫయ్యేళ్ళ క్రితం ఎవరూ విననైనా విని ఉండరు. కేవలం 655 మంది, అందులోనూ 643 మంది మలయాళీ షెడ్యూల్డ్ తెగల వారున్న 200 గడపల గ్రామం అది. కానీ, ఆ రోజు జరిగిన ఆ దారుణ ఘటనతో ఒక్కసారిగా ఆ గ్రామం వార్తల్లో నిలిచింది. గంధపుచెక్కల స్మగ్లర్ వీరప్పన్ అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ, పోలీసులు, అటవీ అధికారులు గ్రామంపై దాడి చేశారు. అక్కడ గిరిజనులపై సాగించిన అమానుషం, బడికెళ్ళే ఓ చిన్నారి సహా 18 మంది మహిళలపై సామూహిక అత్యాచారం, తాగునీటిలో విషం కలిపిన తీరు, పశువుల్ని ఊచకోత కోసి ఊరి బావిలో పడేసిన వైనం... ఆ గ్రామం రూపురేఖల్నే మార్చేశాయి. 'గంధపు చెక్కల స్మగ్లింగ్ గ్రామం' అని ముద్రవేస్తూ అమాయకులపై అధికారులు సాగించిన ఆ దమనకాండ ఓ మాయని మచ్చ. కేంద్ర నేర దర్యాప్తు సంస్థ (సీబీఐ) లోతుగా విచారించి అధికారుల తప్పు తేల్చినా, ఏళ్ళ తరబడి వాయిదా పడుతూ వచ్చిన న్యాయం ఇన్నాళ్ళకు దక్కింది. బాధితులకు కాస్తయినా ఊరట దక్కింది. 1992 జూన్ 20 నుంచి మూడు రోజులు సాగిన అమానుష ఘటనలో మొత్తం 269 మంది నిందితులు కాగా, వారిలో 54 మంది న్యాయ విచారణ కాలంలోనే కన్నుమూశారు. మిగిలినవారికి ఇప్పుడు శిక్ష పడింది. ఈ కథ ఇక్కడి దాకా రావడం వెనుక న్యాయం కోసం సుదీర్ఘంగా సాగిన పోరాటం ఉంది. అప్పట్లో అధికారులపై కేసులు నమోదు కాకపోగా, గిరిజనులపైనే స్థానిక పోలీసులు ఎదురు కేసులు పెట్టిన పరిస్థితి.

గిరిజనులు తమ ఇళ్ళను తామే ధ్వంసం చేసుకున్నారని అధికారులు బుకాయించారు. హైకోర్ట్ ఆదేశిస్తే గానీ చివరకు సీబీఐ దర్యాప్తు జరగలేదు. అంతరాయాలతో విచారణ సుదీర్ఘంగా 19 ఏళ్ళు సాగి, చివరకు 2011లో ధర్మపురి సెషన్స్ కోర్ట్ అధికారులను దోషులుగా తేల్చి, శిక్ష వేసింది. దోషులు మద్రాస్ హైకోర్ట్‌ను ఆశ్రయించడంతో మరో 11 ఏళ్ళ సుదీర్ఘ కాలం గడిచిపోయింది. ఈ కేసు విచారణ సత్వరమే పూర్తి చేయాలని హైకోర్ట్ న్యాయమూర్తి ఒకరు ఈ ఏడాది మొదట్లో పట్టుబట్టడంతో ఇప్పటికైనా కథ ఓ కొలిక్కి వచ్చింది. చిత్రం ఏమిటంటే వాచాత్తి దమన కాండపై అప్పట్లోనే ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైతే, ప్రభుత్వంలో ఉన్నత హోదాల్లో ఉన్నవారు అలాంటి నేరాలకు పాల్పడరంటూ జడ్జి దాన్ని కొట్టేయడం! జయలలిత సారథ్యంలోని అప్పటి అన్నాడీఎంకె పాలకులు, స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు ఈ ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఆ తరువాత అధికారంలో ఉన్న డీఎంకె, అన్నాడీఎంకె సర్కార్లూ తమ బ్యూరోక్రాట్లకు కాపు కాసేందుకే ప్రయత్నించాయి. కొందరు ఉద్యమకారులు, లాయర్లు, నిజాయతీపరులైన అధికారులు, జడ్జీల వల్ల చివరకు న్యాయం జరిగింది. అత్యాచార బాధితులు పట్టువిడవకుండా పోరాడడంతో ఇప్పటికైనా సత్యం గెలిచింది. కళ్ళకు గంతలు కట్టుకున్న న్యాయదేవత సాక్షిగా ధర్మం నిలిచింది. కేవలం 655 మంది ఆదివాసీలు బలమైన రాజ్యవ్యవస్థతో తలపడి, విజయం సాధించడం చరిత్రాత్మకం. ఆ రకంగా ఇది బలవంతులపై బలహీనుల గెలుపు. ఆదివాసీల హక్కుల గెలుపు. న్యాయవ్యవస్థ స్వతంత్రమనీ, పాలకుల తప్పులను సైతం సహించదనీ రుజువైంది. ఎస్సీ%--% ఎస్టీ చట్టం ఇప్పటికీ బలంగానే ఉందని తేలింది. అయితే, నేటికీ కొనసాగుతున్న అనేక దమనకాండ కేసుల్లో ఇంత సుదీర్ఘ పోరాటం, సత్యాన్ని వెలికితీసి దోషులకు శిక్షపడేలా బృహత్ యత్నం సాధ్యమేనా? న్యాయం దక్కడంలో ఆలస్యమైతే, న్యాయం చేయనట్టే! వాచాత్తి ఘటనలో అపరిమిత ఆలస్యమైంది. దోషుల్లో పలువురు బెయిల్‌పై బయట గడిపి, ఉద్యోగ ప్రయోజనాలన్నీ పొంది, హాయిగా రిటైరయ్యారు. ఇప్పటికైనా దోషులను శిక్షించడమే కాక, బాధితులకు తగిన న్యాయం చేయాలి. నష్టపరిహారాలిస్తే సరిపోదు. నలుగురిలో గౌరవంగా బతికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. వలసవాద బ్రిటీషు పాలన లక్షణాలను పోలీసులు, అధికారులు ఇప్పటికైనా వదిలించుకొంటే మేలు. తమిళనాట గిరిజనులపై అమానుషాల నుంచి మిజోరమ్‌లో గ్రామాల దహనం, కశ్మీర్‌లో నిర సనకారులపై కాల్పుల దాకా దశాబ్దాలుగా చూస్తున్నవే. బ్రిటీషు దౌర్జన్యానికి మన భారతీయ పోలీ సులు వారసులుగా మారిన వైనానికి ఇవి ప్రతీకలు. పదే పదే సాగుతున్న మానవహక్కుల ఉల్లంఘనకు సాక్ష్యాలు. అందుకే, "దాడుల పేరిట చట్టవ్యతిరేక చర్యలకు" పోలీసులు బరి తెగించడం దుస్సహమని కోర్ట్ అన్న మాట కీలకం. నిన్నటికి నిన్న కూడా వార్తల్లో కనిపిస్తున్న ఇళ్ళపై దుర్మార్గ దాడుల ధోరణిని వ్యవస్థ సత్వరమే వదిలించుకోవాలి. వాచాత్తి కేసు గుర్తుచేస్తున్న పాఠం అదే!



# ఏ వెలుగులకీ ప్రస్థానం!

చదివేస్తే ఉన్న మతి పోయిందని నానుడి. బాంబే ఐఐటీ పాలకవర్గం నిర్వాకం వల్ల తిండి చుట్టూ మన సమాజంలో అల్లుకొని ఉన్న వివక్ష ఆ ఉన్నత శ్రేణి విద్యాసంస్థను కూడా తాకింది. బాంబే ఐఐటీ హాస్టళ్లలో మూణ్ణెల్ల క్రితం శాకాహారులకు విడిగా టేబుల్స్ కేటాయించాలన్న డిమాండ్ బయల్దేరింది. మాంసాహారుల పక్కన కూర్చుంటే ఆ ఆహారం నుంచి వచ్చే వాసనల కారణంగా తమలో వికారం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆ డిమాండు చేస్తున్నవారి ఫిర్యాదు. ఎప్పుడో 1958లో స్థాపించిన ఆ విద్యాసంస్థలో ఇప్పుడే ఈ డిమాండ్ ఎందుకు తలెత్తిందన్న సంగతలా వుంచితే... దాన్ని అంగీకరిస్తే మాంసాహారం అపవిత్రం లేదా మలినం అని సమాజంలోని కొన్ని వర్గాల్లో నెలకొన్న అభిప్రాయానికి ఆమోదముద్ర వేసినట్టవుతుందన్న సందేహం బాంబే ఐఐటీ పాలకవర్గానికి కలగలేదు. ప్రాంగణంలోని మూడు హాస్టళ్లలో విడిగా ఆరు టేబుళ్లను 'వెజిటేరియన్ ఓన్లీ' బోర్డులతో అలంకరించింది. అంతటితో ఊరుకోలేదు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థికి రూ. 10,000 జరిమానా విధించింది. ఈ నిరసన ఘర్షణకు దారితీస్తుందనీ, క్రమశిక్షణ ఉల్లంఘన కిందికొస్తుందనీ డీన్ అంటున్నారు. ఇలాంటి డిమాండ్ తలెత్తినప్పుడు దానిపై అందరి అభిప్రాయాలూ తీసుకోవటం, ఒక కమిటీని నియమించటం, దాని సాధ్యాసాధ్యాలు, పర్యవసానాలపై చర్చించటం ప్రజాస్వామిక పద్ధతి. అలాంటి విధానమే అమలైవుంటే శాకాహార విద్యార్థులు అంతిమంగా తమ డిమాండ్‌ను వదులుకునేవారో, మాంసాహార ప్రియులు వారి సమస్య పట్ల సానుభూతితో వ్యవహరించేవారో తెలిసేది. ఈ ప్రక్రియ అమలైందా లేదా... అందులో వచ్చిన అనుకూల, ప్రతికూల అభిప్రాయాలేమిటన్నది ఎవరికీ తెలియదు. బాంబే ఐఐటీలోని అంబేద్కర్ పెరియార్ ఫూలే స్టడీ సర్కిల్ (ఏపీపీఎస్సీ) విద్యార్థుల ప్రకారం పాలకవర్గం ఈ మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచింది. కనుక సహజంగానే నిరసనలు వ్యక్తమయ్యాయి. 'మేం ఏం చేసినా శిరసావహించాల్సిందే, లేకుంటే కొరడా ఝుళిపిస్తాం' అన్నట్టు వ్యవహరించటం, ప్రశ్నించటమే నేరమన్నట్టు పరిగణించటం ఉన్నత శ్రేణి విద్యాసంస్థకు శోభస్కరం కాదు. వికారాలున్నవారిని దూరంగా పోయి తినమని చెప్పక గోటితో పోయేదానికి గొడ్డలి అందుకున్నట్టు ఇంత రాద్ధాంతం దేనికో అర్థం కాదు. పాశ్చాత్య దేశాల్లో కూడా శాకాహారం, మాంసాహారం విభజన వుంది. డెయిరీ ఉత్పత్తులు సైతం సమ్మతం కాదనే వెగానిజం కూడా అక్కడుంది. అమెరికన్లలో గత మూడు నాలుగేళ్లలో దాదాపు 15 శాతం మంది శాకాహారులుగా మారారని ఈమధ్య ఒక సర్వే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2020లో 1,400 కోట్ల డాలర్లుగా ఉన్న వెగాన్ మార్కెట్, ఆ మరుసటి ఏడాదికి 1,577 కోట్ల డాలర్లకు పెరిగిందని మరో సర్వే అంటున్నది. అయితే మన దేశంలో వలే అక్కడ తినే ఆహారం కులాలతో ముడిపడి లేదు. ఇక్కడ శాకాహారులు చాలా ఉన్నతులనీ, మాంసాహారులు తక్కువనీ అభిప్రాయం బలంగా పాతుకుపోయింది. అందుకు మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా దోహదపడుతున్నాయి. ఆహారపుటలవాట్లలో కులాన్ని వెతకటం పాక్షిక దృష్టి అంటున్నవారు కొన్ని తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో, మహారాష్ట్ర, కశ్మీర్ వంటిచోట్ల బ్రాహ్మణులు మాంసాహారులుగా ఉండటాన్ని ఉదహరిస్తున్నారు. కానీ ఇవి చెబుతున్నవారు మన దేశంలో చాలాచోట్ల అట్టడుగు కులాలవారికి అద్దెకు ఇల్లు ఇవ్వకుండా ఉండటానికి 'వెజిటేరియన్లకు మాత్రమే' అనే బోర్డులు పెడుతున్న ధోరణిని మరిచిపోకూడదు. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను ఒంటిస్తంభం మేడలో ఉంచి చదువు చెప్పించాలనుకోకుండా... ప్రాథమిక విద్య మొదలుకొని అన్ని దశల్లోనూ విద్యాసంస్థలకు పంపటంలో ఒక అంతరార్థం ఉంటుంది. వివిధ వర్గాల పిల్లలతో కలిసిమెలిసి పెరగటం, సామాజిక అవగాహన పెంపొందించుకోవటం అనే లక్ష్యాలు కూడా అంతర్లీనంగా ఇమిడివుంటాయి. తెలియనిది తెలుసుకోవటం, భిన్నత్వాన్ని గౌరవించటం, అవసరమైతే ప్రశ్నించటం, ఈ క్రమంలో తనను తాను మార్చుకోవటం కూడా విద్యాసముపార్జనలో భాగమే. బాధ్యతాయుతమైన రేపటి పౌరులుగా రూపొందటానికి ఇవన్నీ అవసరం. బాంబే ఐఐటీలో చదువుతున్నవారు పరిశోధనల కోసమో, ఉన్నతోద్యోగాల కోసమో విదేశాలకు వెళ్లవలసి వచ్చినప్పుడు తోటి మనిషి ఆహారాన్ని చూసి వికారాలు తెచ్చుకోవటం అక్కడికి కూడా మోసుకుపోతే క్షణకాలమైనా మనుగడ సాగించగలరా? ఈ ఆలోచన వాళ్లకు రాకపోతే పోయింది... సంస్థ నిర్వాహకులకేమైంది? ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని రాజ్యసభలో మొన్న జూలైలో కేంద్రం తెలిపింది. ఈ ఉదంతాల్లో వ్యక్తిగత కారణాలను వెదకటం తప్ప సంస్థాగతంగా ఎలాంటి దిద్దుబాటు చర్యలు అవసరమన్న విచికిత్సలోకి పోవటం లేదు. తినే తిండి మొదలుకొని ఎన్నిటినో ఎత్తి చూపి న్యూనత పరిచే ధోరణి ఉండటాన్ని ఈ సంస్థల పాలకవర్గాలు గుర్తించటం లేదు. బాంబే ఐఐటీ మరో అడుగు ముందుకేసి అలాంటి ధోరణులను బలపర్చే నిర్ణయాన్ని తీసుకోవటం ఆందోళన కలిగించే అంశం. ఈ జాడ్యం హైదరాబాద్ ఐఐటీకి కూడా వ్యాపించిందంటున్నారు. ఏకంగా శాకాహారుల కోసం అది ప్రత్యేక హాల్ కేటాయించబోతున్నదన్న వార్తలొస్తున్నాయి. తమ సంస్థల్ని ప్రపంచ శ్రేణి విద్యా కేంద్రాలుగా రూపుదిద్దటం ఎలాగన్న ఆలోచనలు మాని, క్షీణ విలువలను తలకెత్తుకోవటం ఏ మేరకు సమంజసమో నిర్వాహకులు ఆలోచించాలి.



Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS, H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in